ప్రజా సంక్షేమమే
కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం
» రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి 7

బాలుడి మృతదేహం లభ్యం
» జూరాల కాలువలో చేపల వేటకు వెళ్లి గల్లంతు

దుండగులపై కఠిన చర్యలు
» ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్
» సంజాపూర్ గ్రామంలో పర్యటన
» హత్యాయత్నం జరిగిన స్థలం పరిశీలన



హత్యాయత్నం జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ 6

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

● ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

ధరూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం కలెక్టర్ బీఎం సంతోష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర క్వింటాలుకు రూ.2,386లు లభిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన మూడు రోజుల్లో రైతుల ఖాతాలో నగదును జమ చేస్తారని తెలిపారు. కలెక్టర్ బీఎం సంతోష్ మాట్లాడుతూ గతేడాది ఒక లక్ష టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఈ ఏడాది రెండు లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్న లక్ష్యం పెట్టుకున్నామని తెలిపారు. జిల్లాలో 80 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్ నర్సింగరావు, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ హనుమంతు, వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శ్రీధర్ గౌడ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు తదితరులు ఉన్నారు.



ధరూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మందకొడిగా పత్తి కొనుగోలు

» నేటికి ప్రారంభం కాని మరో మిల్లు
» గద్వాల జిల్లాలో 1,55,641 ఎకరాల్లో పత్తి సాగు
» దిగుబడి అంచనా 22 లక్షల క్వింటాళ్లు
» ఇప్పటికి సీసీఐ కొన్నది 9వేల క్వింటాళ్లే..
» కపాస్ యాప్‌లో స్లాట్ బుక్‌కాకపోవడంతో ఇబ్బంది పడుతున్న రైతులు



గద్వాలలో జిన్నింగ్ మిల్లు వద్దకు పత్తి లోడ్‌తో వచ్చిన వాహనాలు

గద్వాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) రైతులు కష్టపడి పండించిన పత్తిని విక్రయించేందుకు నానా తిప్పలు పడుతున్నారు. సీసీఐ ద్వారా విక్రయిద్దామంటే కపాస్ యాప్‌లో స్లాట్ బుక్‌కావడం లేదు. దీంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంట దెబ్బతినడం, తేమ శాతం ఎక్కువగా ఉండటంతో వారు కూడా తక్కువ ధరకు అడుతున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో పత్తిసాగు అధికంగా ఉన్నప్పటికీ అందుకు తగిన జిన్నింగ్ మిల్లులు లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

మొదటి విడత పత్తి రాయిచూరుకే..

గద్వాల జిల్లాలో ఈ ఏడాది 1లక్షా55 వేల 641ఎకరాలలో పత్తి సాగు చేశారు. ఇతర జిల్లాలతో పోలిస్తే గద్వాల జిల్లాలో వర్షపాతం తక్కువగా నమోదైంది. దీంతో పత్తి దిగుబడి మామూలుగా వచ్చింది. 22లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు మార్కెటింగ్ అధికారులకు నివేదిక ఇచ్చారు. మొదట విడుతలో వచ్చిన పత్తి నాణ్యత తక్కువగా ఉండటంతో రైతులు మధ్య దళారుల ద్వారా రాయిచూరులో విక్రయించారు. రెండో విడత, ప్రస్తుతం వచ్చినపత్తి నాణ్యతగా ఉండటంతో రైతులు ఇళ్ల వద్దే నిల్వ చేసుకున్నారు. ఈ లోపే సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం రైతులకు కొంత ఊరటనిచ్చింది. జిల్లాలో పత్తి మార్కెట్ లేకపోవడంతో దళారులు పుట్టుకొస్తున్నారు. ప్రస్తుతం 200మందికి పైగా ఉన్నారు. వీరు ఒక్కొక్కరు ప్రతీ రోజు 30నుంచి 35 క్వింటాళ్ల పత్తిని రాయిచూర్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. గత నెల 27వ తేదీన అలంపూర్ చౌరస్తాలో, ఈ నెల 3వ తేదీన గద్వాలలో సీసీఐ ద్వారా కొనుగోళ్లు ప్రారంభించడంతో వారి వ్యాపారం నెమ్మదించింది.

సామర్థ్యం లేని జిన్నింగ్ మిల్లులు

జిల్లాలో మూడు జిన్నింగ్ మిల్లులకు కొనుగోలు అనుమతులు వచ్చాయి. ఇందులో ఒకటి ఆలంపూర్ చౌరస్తాలో ఉంది. దీని సామర్థ్యం ప్రతీ రోజు 2,100 క్వింటాళ్లే, గద్వాలలో ఉన్న మిల్లు సామర్థ్యం 1,350 క్వింటాళ్లు మాత్రమే.. అలంపూరు చౌరస్తాలోని మిల్లులో గత నెల 27వ తేదీన పత్తి కొనుగోలు ప్రారంభించారు. ఇప్పటి వరకు 7,577 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేశారు. గద్వాలలోని మిల్లులో ఈ నెల 3వ తేదీ నుంచి కొనుగోలు ప్రారంభించగా ఇప్పటి వరకు 1,760 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేశారు. హరిత కాటన్ జిన్నింగ్ మిల్లులో ఇప్పటి వరకు కొనుగోలు ప్రారంభించలేదు. ఈ మిల్లు సామర్థ్యం 2,100 క్వింటాళ్లు మాత్రమే. మూడింటిని కలిపినా ప్రతీ రోజు 5,550 క్వింటాళ్లను మించి సీసీఐ కొనుగోలు చేయలేదు.

కిసాన్ కపాస్ యాప్‌తో తిప్పలు..

కిసాన్ కపాస్ యాప్‌తో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. మిల్లుల సామర్థ్యాన్ని బట్టి టార్గెట్ పూర్తి కాగానే యాప్‌లో ఆ బిల్లు బ్లాక్ అవుతోంది. మళ్లీ మరుసటి రోజే ఓపెన్ అవుతున్నది. ఈ సమస్య పరిష్కారానికి రైతులకు ఒక షెడ్యూల్ ఇచ్చి మూడు రోజులకు ఒకేసారి స్లాట్ బుక్‌చేసుకునేలా.. అవి పూర్తిగాకానే మళ్లీ మూడు రోజులకు స్లాట్ బుక్ చేసుకునే విధానం అమలు చేయాలని కలెక్టర్ సీసీఐ అధికారులను ఆదేశించారు. అయితే వారు మాత్రం మేనేజర్ నుంచి అనుమతి వస్తే తప్ప చేయలేమని చేతులెత్తేస్తున్నారు. దీంతో ప్రతీ రోజు స్లాట్ బుకింగ్ కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారు.



మరో మిల్లు ఓపెన్ చేస్తాం

జిల్లాలో మూడు జిన్నింగ్ మిల్లులలో సీసీఐ కొనుగోలు ప్రారంభించేందుకు అనుమతులు వచ్చాయి. రెండు మిల్లుల్లో కొనుగోలు చేస్తున్నాం. త్వరలోనే మూడో మిల్లులో కూడా కొనుగోళ్లు ప్రారంభిస్తాం. జిల్లాలో జిన్నింగ్ మిల్లులు తక్కువ, సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో కొనుగోళ్లకు కొంత సమయం పడుతోంది.

- పుష్పమ్మ, మార్కెటింగ్ అధికారి గద్వాల

ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం
» పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ 6

గుబులు రేపుతున్న మబ్బులు
» కమ్ముకుంటున్న కారుమేఘాలు
» ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతుల కష్టాలు 6

సత్తా చాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు
» నేషనల్ క్రికెట్ లీగ్‌కు ముగ్గురి ఎంపిక
» రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఇద్దరు 7



వద్దన్నా.. వాన

నాగర్‌కర్నూల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

- అధిక వర్షంతో రైతులు కుదేలు
- భారీగా దెబ్బతిన్న పత్తి, వరి, కూరగాయల పంటలు

నాగర్‌కర్నూల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల నుంచి నాగర్‌కర్నూల్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు రైతాంగాన్ని నట్టేట ముంచాయి. పత్తి, మిర్చి, కూరగాయలు సాగు చేసిన రైతులు అప్పుల ఊబీలో కూరుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతేడాదిలో పత్తి పంటను వేసి నష్టపోయిన రైతులు ఈ ఏడాదైనా నష్టాల నుంచి గట్టెక్కాలని భావించారు. ఈ క్రమంలో పత్తి సాగు చేసిన రైతులకు దుఃఖమే మిగిలింది.

నిండా మునిగిన రైతులు

జిల్లాలో అధిక వర్షాలు, చీడపీడల కారణంగా 56వేల 724ఎకరాల్లో వివిధ పంటలను రైతులు నష్టపోయారు. దీంతో సుమారు రూ. 36.37కోట్ల విలువైన పంట నష్టం వాటిల్లింది. ఇందులో 59వేల 342ఎకరాల్లో పత్తి, 17వేల 437ఎకరాల్లో వరి, 1,304ఎకరాల్లో మినుములు, 4,680ఎకరాల్లో వేరుశనగ, 41వేల ఎకరాల్లో మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పత్తి రైతులకు కష్టాలు తప్పడం లేదు. గతంలో సీసీఐ ద్వారా ఎకరాకు 12 క్వింటాళ్ల చొప్పున పత్తిని కొనుగోలు చేస్తామన్నారు. ఇటీవల దిగుబడి 7క్వింటాళ్లకే కుదించడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

రికార్డు స్థాయిలో వర్షపాతం..

జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల్లో సాధారణ వర్షపాతం కంటే అధికంగా నమోదైంది. ఈ క్రమంలో కూరగాయలు, ఆకుకూరల పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలో 86.3 శాతం వర్షపాతం నమోదైంది. జిల్లా చరిత్రలో ఇంత భారీ వర్షపాతం నమోదైన ఘటనలు లేవు. భారీ వర్షాలతో జిల్లా కేంద్రం జలమయమవుతోంది. దూరదృష్టి లేకుండా కట్టిన డివైడర్ల కారణంగా కూడా కొద్దిపాటి వర్షానికే నాగర్‌కర్నూల్ పట్టణంలో రాకపోకలకు ప్రధాన అవరోధంగా మారిందనే విమర్శలు వస్తున్నాయి.



జలమయమైన రహత్‌నగర్ కాలనీ (ఫైల్)

పంట నష్టం వివరాలు
నమోదు చేయించుకోవాలి 6

9న జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక 7

పవర్ 'ఫుల్'
» రికార్డు స్థాయిలో జల విద్యుత్ ఉత్పత్తి
» ప్రాజెక్టుల ప్రారంభం నుంచి ఇదే అత్యధికం



విద్యుత్ ఉత్పత్తిని సూచించే ప్యానల్ బోర్డులు 7

వాట్సాప్ స్టేటస్‌లో
'ద ఎండ్'
» మూడో అంతస్తుపై నుంచి దూకిన నర్సింగ్ విద్యార్థిని
» పరిస్థితి విషమం..

గుప్తనిధుల కోసం
తవ్వకాలు



రాయలగండి శ్రీ లక్ష్మీచెన్నకేశవ ఆలయంలో తవ్వకాలు జరిగిన ప్రాంతం 6

నాణ్యత పేరుతో తిరస్కరిస్తున్నారు

- ఉండవల్లి వద్ద జాతీయ రహదారిపై పత్తి రైతుల రాస్తారోకో



ఉండవల్లి వరసిద్ధి వినాయక కాటన్ మిల్లు ఎదుట జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

- రెండుగంటల పాటు నిలిచిన వాహనాలు
- పోలీసుల హామీతో శాంతించిన రైతులు

అలంపూరు చౌరస్తా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) :నాణ్యతలేదనే కారణంతో పత్తిని తిరస్కరిస్తున్నారని పత్తిరైతులు మరోసారి రోడ్డెక్కారు. గురువారం సాయంత్రం జోగుళాంబగద్వాల జిల్లా ఉండవల్లి వద్ద 44వ జాతీయరహదారిపై రాస్తారోకో చేశారు. అధిక వర్షాల కారణంగా దిగుబడి తగ్గి పోయాయని, వచ్చిన పత్తిని తిరస్కరిస్తే.. తెచ్చిన అప్పులు ఎలా కట్టాలని రైతులు మండిపడ్డారు. సీసీఐ అధికారులు అంక్షలు లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సుమారు రెండుగంటల పాటు రాస్తారోకో చేయడంతో రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి పోయాయి. ఇటిక్యాల ఎస్సై రవి అక్కడికి చేరుకుని మీ సమస్యను ఉన్నతాధికారుల కు తెలుపుతామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. ఆనంతరం సీఐ రవిబాబు, కోదండాపురం ఎస్సై మురళి, ఉండవల్లి ఎస్సై శేఖర్‌లు మిల్లు వద్దకు చేరుకుని రైతులకు సమస్యలకు రాకుండా చూసుకోవాలని మార్కెట్ యార్డు సెక్రటరీ ఎల్లస్వామికి సూచించారు. రైతులు ప్రతీ సారి జాతీయరహదారిపై రాస్తారోకో చేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి 7
» డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ » వెల్దొండలో పోలీసుల 'కమ్యూనిటీ కాంటాక్ట్'

వేరుశనగ విత్తనాలు ఇస్తలేరని
రోడ్డెక్కిన రైతులు



పాన్‌గల్ అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న రైతులు

పాన్‌గల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించే వేరుశనగ విత్తనాల కోసం రైతులు రోడ్డెక్కారు. వివిధ గ్రామాల రైతులు గురువారం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్య యాదవ్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్యానాయక్‌లు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూనె ఉత్పత్తులను పెంపొందించేందుకు రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తోంది. అవసరం ఉన్న రైతులందరికీ ఉచితంగా వేరుశనగ విత్తనాలను అందించాలని డిమాండ్ చేశారు. రాజకీయ నాయకుల పలుకుబడి ఉన్న వారికి లెక్కకు మించి వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయడం సరికాదన్నారు. మండల వ్యవసాయ అధికారి మణిచందర్, హెడ్ కానిస్టేబుల్ యాదగిరి రాస్తారోకో వద్దకు వచ్చి రైతులతో మాట్లాడారు. గోదాంలో స్టాక్ లేకపోవడం వల్ల రైతులకు విత్తనాలను పంపిణీ చేయడం లేదని, ప్రభుత్వం నుంచి కోటా వస్తే పంపిణీ చేస్తామని ఏఓ తెలిపారు. అవసరమున్న రైతులందరికీ వేరుశనగ విత్తనాలను అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు వినతి పత్రం అందించి రాస్తారోకో విరమించారు.

పీఏసీఎస్ చైర్మన్
పోషం గణేశ్ సస్పెన్షన్ 6

ఖగోళ శాస్త్ర ప్రయోగశాలను
తిలకించిన డీఈవో



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 110.00
హోల్ సేల్	: 122.00
డ్రెస్డ్	: 191.00
స్కిన్ లెస్	: 218.00

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్
» అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
» జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం 6

ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం

- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్



ఎంఓయూ ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్‌బాబు, బయోసైన్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జాన్‌పీటర్

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. వర్ష బయోసైన్స్ అండ్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో గురువారం పాలమూరు యూనివర్సిటీ ఎంఓయూ కుదుర్చుకున్నది. యూనివర్సిటీ పరిపాలనా భవనంలోని వీసీ చాంబర్‌లో బయోసైన్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జాన్‌పీటర్, టెక్నాలజీ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధికారి, ప్రొఫెసర్ టీవీ రావులతో కలిసి వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బాబు, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ కిషోర్‌లతో కలిసి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఎంఓయూతో అగ్నిబయోటెక్ విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లకు ఎంతో ఉపయోగకరమన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- తూకం చేసిన వెంటనే మిల్లులకు పంపించాలి
- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి



రైతులు తెచ్చిన ధాన్యాన్ని టోకెన్ల వారీగా రిజిస్టర్లలో నమోదు చేయాలని నిర్వాహకులకు చెబుతున్న కలెక్టర్

వనపర్తి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని, తూకం పూర్తయిన వెంటనే ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేసి, కేటాయించిన మిల్లులకు పంపించాలని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. వనపర్తి జిల్లా, చిట్యాలలోని మార్కెట్ యార్డులో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గు రువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశా రు. రైతులు తెచ్చిన ధాన్యం వివరాలను టోకెన్ల వారీగా రిజిస్టర్లలో నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తెచ్చిన ధాన్యాన్ని తెచ్చినట్లుగా రిజిస్టర్లలో నమోదు చేయాలని, తేమ శాతాన్ని పరిశీలిం చి నమోదు చేయాలని సూచించారు. సన్న, దొడ్డు రకం బియ్యాన్ని గుర్తించడం లో నిర్వాహకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అక్కడే ఉన్న నిర్వాహకురా లిని గుర్తించాలని ఆదేశించగా, ఆమె తడబాటుకు గురవడంతో ఆగ్రహం వ్య క్తం చేశారు. ధాన్యం గుర్తించే విధానాన్ని వారికి నేర్పించాలని సీసీకి సూచించారు.

పంట నష్టం వివరాలు నమోదు చేయించుకోవాలి



వటువర్లపల్లిలో నీట మునిగిన పంటను పరిశీలిస్తున్న ఏఓ మహేశ్‌రెడ్డి

బ్రహ్మగిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండల వ్యవసాయాధికారి మహేశ్‌రెడ్డి రైతులకు సూచించారు. వటువర్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంట నష్టం వివరాలను రైతులు విధిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. సీసీఐ ద్వారా పత్తిని విక్రయించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పట్టాదారు పాస్‌బుక్, బ్యాంకు ఖాతాబుక్, ఆధార్ కార్డు, పంట పొలం వద్ద దిగిన ఫొటోలతో వ్యవసాయ శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం గ్రామ సమీపంలో నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఆయన వెంట ఏఈవో దేవి, రైతులు కాశయ్య, శ్రీను, మల్లేశ్, శంకర్, బాబురావు, విష్ణు తదితరులున్నారు.

ఖగోళ శాస్త్ర ప్రయోగశాలను తిలకించిన డీఈవో



ఖగోళశాస్త్ర ప్రయోగశాలను తిలకిస్తున్న డీఈవో

జడ్చర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఖగోళ శాస్త్ర ప్రయోగశాలను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ తిలకించారు. పాఠశాలను గురువారం ఆయన సందర్శించిన సందర్భంగా పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అపార్ ఐడీ జనరేషన్ క్యాంప్‌ను పరిశీలించారు. అనంతరం వంటగది, ఔషధ తోటలను సందర్శించారు. ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, ఉపాధ్యాయులు గోపాల్, యుగంధర్, సునీల్‌కుమార్, నస్రీన్‌ఫాతిమా పాల్గొన్నారు.

ఊకచెట్టు వాగులో మృతదేహం లభ్యం

ఆత్మకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండలంలోని తిప్పడంపల్లి శివారులోని ఊకచెట్టువాగులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ జయన్న, గ్రామపరిపాలన అధికారి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వాగులో మృతదేహం ఉన్నట్లు గురువారం మధ్యాహ్నం 12 గంటలకు సమాచారం అందించడంతో ఎస్‌ఐతో పాటు వాగువద్దకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయసు దాదాపు 45 సంవత్సరాలు ఉంటుందని, ఎత్తు 5.5 ఉందని, ఒంటిపై ఆకుపచ్చ టీ షర్ట్ , నీలి రంగు లోయర్ ఉన్నాయని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మక్తల్ మండలం పారేవుల వద్ద యంత్రంతో వరి కోతలు



ఊట్కూర్ మండలం తిప్రాస్‌పల్లి దగ్గర పత్తిమిల్లులో విక్రయంకోసం వరుసలో ఉంచిన వాహనాలపై టార్పాలిన్‌కవర్లు కపిగా ఆకాశం మేఘావృతం

గుబులు రేపుతున్న మబ్బులు

- హఠాత్తుగా కమ్ముకుంటున్న కారుమేఘాలు
- ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతుల కష్టాలు



మక్తల్ మండలం పారేవుల వద్ద ఆరబోసిన ధాన్యాన్ని కుప్పలు కడుతూ టార్పాలిన్ కవర్లు కప్పుతున్న రైతులు

నారాయణపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆకాశంలో కమ్ముకుంటున్న కారుమేఘాలు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. నారాయణపేట జిల్లాలో ప్రస్తుతం వరి కోతలు, పత్తి తీతలు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో వర్షం వస్తే చేసిన కష్టమంతా నీటి పాలవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని పారేవులలో గురువారం ఉదయం వాతావరణంగా బాగానే ఉంది. మధ్యాహ్నం తర్వాత ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. ఆ సమస్యలో యంత్రంతో వరి కోతలు కొనసాగిస్తున్న రైతులు ఒక్క సారిగా ఆందోళనకు గురయ్యారు. అప్పటికే కోతలు పూర్తయి కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు పరుగులు తీశారు. వాటిపై టార్పాలిన్లు, కవర్లు కప్పేందుకు హడావిడి పడ్డారు. అలాగే ఊట్కూర్ మండలంలోని తిప్రాస్‌పల్లి మిల్లు వద్దకు రైతులు పత్తిలోడుతో తెచ్చిన వాహనాలు బారులు తీరి ఉన్నాయి. మబ్బులు కమ్ముకోవడంతో పత్తిని కాపాడుకునేందుకు వాహనాలపై కవర్లు కప్పుకున్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
- జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



క్రీడా పోటీల ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, నవంబరు 6 : (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ విద్యార్థులకు సూచించారు. నాగర్‌కర్నూల్ అచ్చంపేటలో గురువారం ఏర్పాటు చేసిన జోన్-7, 11వ జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. రాష్ట్రాన్ని క్రీడాహబ్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేందర్, మునిసిపల్ ఛైర్మన్ శ్రీనివాసులు, జోనల్ అధికారులు, డీఎస్‌వో శ్రీనివాసులు, పీఈటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మల్టీ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరం

అచ్చంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గురువారం ఏర్పాటు చేసిన మల్టీ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభించారు. సీబీఎం ట్రస్ట్ సహకారంతో, ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాల వైద్యులు స్థానికులకు వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ సూచన మేరకు గతంలో సర్జికల్ క్యాంపు నిర్వహించినట్లు గుర్తు చేశారు.

1,467 మందిని వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఆపరేషన్లు చేసినట్లు చెప్పారు. వైద్య శిబిరంలో 1439 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభు, వైద్యులు మహేశ్, పావని, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుండగులపై కఠిన చర్యలు

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్
- సంజాపూర్ గ్రామంలో పర్యటన
- హత్యాయత్నం జరిగిన స్థల పరిశీలన



వివరాలను తెలుసుకుంటున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

కల్వకుర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నం చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకుంటామని నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మునిసిపాలిటీ పరిధిలోని సంజాపూర్ గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. గ్రామానికి చెందిన జంగయ్య, అలివేల, పరమేశ్‌లపై హత్యాయత్నం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. సంఘటన వివరాలను ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సంజాపూర్ గ్రామానికి చెందిన గుర్రం మల్లేశ్‌కు, వెల్దండ మండలం చెర్కూర్ గ్రామానికి చెందిన శిరీషతో రెండేళ్ల క్రితం వివాహం అయ్యిందన్నారు. మల్లేశ్‌కు అంతకుముందే మరో యువతితో వివాహేతర సంబంధం ఉండటంతో, శిరీష బాగోగులు చూసుకోవడం లేదు. దీంతో శిరీష కుటుంబ సభ్యులు అతడి పేరున ఉన్న 30 గుంటల భూమిని శిరీష పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారు. మరో 30 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో మల్లేశ్ మూడునెలలుగా భార్యను వదిలేసి, మరో మహిళతో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో శిరీష అన్నలు శివ, ప్రశాంత్‌లతో పాటు వెల్దండకు చెందిన మరో నలుగురు బుధవారం సాయంత్రం సంజాపూర్‌కు వచ్చారు. భూమిని తమ చెల్లెలి పేరున రిజిస్ట్రేషన్ చేయాలని మల్లేశ్ తండి జంగయ్యను కోరగా, అందుకు అతడు ఒప్పుకోలేదు. దీంతో మల్లేష్ తండ్రి జంగయ్య, తల్లి అలివేల, తమ్ముడు పరమేశ్‌లను కర్రలతో కొట్టి, గొడ్డలితో దాడి చేశారు. సంఘటనలో తీవ్రంగా గాయపడిన జంగయ్య, అలివేల, పరమేశ్‌లను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం జంగయ్య పరిస్థితి విషమంగా ఉండగా, అలివేల, పరమేశ్‌ల ఆరోగ్యం నిలకడగా ఉందని ఎస్పీ తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి, నిందితులు ఐదుగురిని అరెస్టు చేశామని, మరొకరు పరారీలో ఉన్నాడని తెలిపారు. అతడి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. దోషులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని, బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ బి.నాగార్జున, ఎస్‌ఐ జి.మాధవరెడ్డి ఉన్నారు.

పీఏసీఎస్ ఛైర్మన్ పోషం గణేశ్ సస్పెన్షన్



అమ్రాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనం

అమ్రాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పీఏసీఎస్ ఛైర్మన్ పోషం గణేశ్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రాథమిక సహకార సంఘానికి ప్రభుత్వం నుంచి వచ్చిన యూరియాను నిర్దేశిత ధర కంటే ఎక్కువకు విక్రయించారని, పక్కదారి పట్టించారని అతడిపై వ్యవసాయశాఖ అధికారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో, అతడిని సస్పెండ్ చేశారు. ఆరు నెలల క్రితం గణేష్ ఛైర్మన్ పదవీ కాలం ముగిసింది. ఎన్నికలు జరపకపోవడంతో పదవీకాలాన్ని ప్రభుత్వం ఆరునెలలు పొడిగించింది. ఇటీవలే మరోసారి మరో ఆరు నెలల పాటు పదవీకాలాన్ని పొడిగించింది. తాజాగా అతడు సస్పెండ్ కావడంతో, ఆయన స్థానంలో ఇప్పలపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ అల్లు మంగమ్మను ఛైర్మన్ నియమిస్తూ ఉత్తర్వులు అందించినట్లు సహకార శాఖ జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ మధు తెలిపారు.

బేకరీల్లో ఆకస్మిక తనిఖీ

- పరిశుభ్రత పాటించకపోతే చర్యలు తప్పవు
- హెచ్చరించిన మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్

మద్దూర్, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మద్దూరు పట్టణంలోని పలు బేకరీలను మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విక్రయానికి సిద్ధంగా ఉంచిన ఆహారపదార్థాలను పరిశీలించారు. ఎక్కువ కాలం నిల్వ ఉంచిన పలు పదార్థాలను, ప్లాస్టిక్ సామగ్రిని సీజ్ చేశారు. అనంతరం మాంసం దుకాణాలను తనిఖీ చేశారు. పరిశుభ్రత పాటించకపోతే చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించారు. ఆ తర్వాత మద్దూర్ కొత్తబస్టాండ్ ప్రధాన మార్గంలో కొనసాగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీల్‌కుమార్, మునిసిపల్ సిబ్బంది ఆంజనేయులు, జాఫర్, కేశవులు ఉన్నారు.



మద్దూర్‌లోని బేకరీలో తినుబండారాలను పరిశీలిస్తున్న కమిషనర్

పుట్టింటికి వెళ్లి తిరిగి రాని భార్య

- పోలీసులకు ఫిర్యాదు చేసిన భర్త

నవాబ్‌పేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పుట్టింటికి వెళ్లిన తన భార్య తిరిగి రాకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నవాబ్‌పేట ఎస్‌ఐ విక్రం గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని కాకర్లపాడ్ గ్రామానికి చెందిన కృష్ణవేణికి కొంతకాలం క్రితం మూసాపేట మండలం వేముల గ్రామానికి చెందిన తోట యాదయ్యతో వివాహమైంది. రెండు నెలల క్రితం ఆమె తన తల్లిగారి ఊరు కాకర్లపాడుకు వెళ్లి అక్కడే ఉండిపోయింది. దీంతో తన భార్యను కాపురానికి పంపించాలని యాదయ్య తన బావమరిది మల్లేష్‌ను కోరాడు. అతడు పంపిస్తామని చెప్పినా ఆమె రాకపోవడంతో మరోసారి ఫోన్ చేశాడు. తన చెల్లెలు మరో వ్యక్తితో వెళ్లినట్లు మల్లేశ్ చెప్పడంతో యాదయ్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుప్తనిధుల కోసం ఆలయంలో తవ్వకాలు



రాయలగండి లక్ష్మీచెన్నకేశవ ఆలయంలో తవ్వకాలకు గురైన ప్రాంతం

పదర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పదర మండలంలోని రాయ లగండి లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో గుప్తనిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపారు. ఆ తర్వాత ఎవరికీ అను మానం రాకుండా గుంతను పూడ్చివేసినట్లు భక్తులు తెలిపారు. ఆలయంలో ఇప్పటికే మూడు సార్లు తవ్వకాలు జరిపినా అధికారులు పట్టించుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

116 గ్రాముల గంజాయి స్వాధీనం



జడ్చర్లలో పట్టుబడిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయి వివరాలు వెల్లడిస్తున్న డీటీఎఫ్ సీఐ కవిత

జడ్చర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలంలోని శంకరాయపల్లితండా వద్ద ఎక్సైజ్ శాఖ మహబూబ్‌నగర్ డీటీఎఫ్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని సోదా చేయగా 116 గ్రాముల గంజాయి లభించింది. అతడిని జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పింటుసాగా గుర్తించారు. ఆయన ఉదండాపూర్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు చేపట్టిన ఓ కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలుసుకున్నారు. తమ రాష్ట్రం నుంచి గంజాయిని తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని డీటీఎఫ్ సీఐ కవిత తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐ రాజేందర్, ఎక్సైజ్ డీటీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

60 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడిన వాహనాలను తాడూరు పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన వైనం

తాడూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. బల్మూరు మండలం గట్టుతుమ్మెన్ గ్రామానికి చెందిన సాయిప్రకాశ్ అనే వ్యక్తికి సంబంధించిన రేషన్ బియ్యాన్ని రెండు బొలెరో వాహనాల్లో కల్వకుర్తికి తరలిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందింది. మండల కేంద్ర సమీపంలో, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి ప్రధాన రహదారిపై, మల్కాపూర్ గేటు వద్ద రెండు వాహనాలను తనిఖీ చేశారు. 60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. వాహనాలను తాడూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడు సాయిప్రకాశ్‌తో పాటు డ్రైవర్లు మల్లేశ్, ఫిరోజ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

బిజినేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలకేంద్రంలో పేకాట శిబిరంపై పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.శ్రీనివాస్ తెలిపారు. వారి నుంచి రూ.20 వేలు, ఏడు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఇసుక స్థావరాలపై దాడులు



ఇసుక స్థావరాలను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఐ శివానందం, తహసీల్దార్ రాధాకృష్ణ

రాజాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు మండలంలోని దుందుభి వాగులో ఇసుకను అక్రమంగా తయారు చేసి తరలిస్తున్న స్థావరాలపై గురువారం రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుందుభి వాగు వద్ద కృత్రిమ ఇసుక తయారు చేసి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు.

క్రైం కార్నర్

వాట్సాప్ స్టేటస్‌లో 'ద ఎండ్'

» మూడో అంతస్తు పైనుంచి దూకిన నర్సింగ్ విద్యార్థిని

» పరిస్థితి విషమం..

» మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్‌లో ఘటన


మల్లి పూజిత(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వాట్సాప్ స్టేటస్‌లో 'ద ఎండ్'.. మరుసటి రోజు కళాశాల మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది ఓ బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని. ఈ ఘటన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, కళాశాల యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల మండల కేంద్రానికి చెందిన మల్లి పూజిత(23) అన్నోజిగూడలో అద్దెకుంటూ అవుశాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో నీలిమా స్కూల్ అండ్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో బీఎస్సీ నర్సింగ్ మూడో సంవత్సరం చదువుతోంది. పూజితకు జ్వరం రావడంతో గురువారం కళాశాలకు ఆమె స్నేహితురాలితో కలిసి ఆటోలో వచ్చింది. మధ్యాహ్నం లంచ్‌కు రాకుండా 1.30 గంటలకు చాలాసేపు ఫోన్‌లో మాట్లాడి రెయిలింగ్‌పై ఫోన్ పెట్టి కళాశాల భవనం మూ డో అంతస్తు నుంచి దూకింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో గమనించిన విద్యార్థులు కళాశాల డీన్ సాయంతో ప్రథమ చికిత్స నిమిత్తం జీడిమెట్లలోని నీలిమను ఆస్పత్రికి తరలించారు. స మాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పూజిత ఆత్మహత్యాయత్నానికి కారణాలను ఆమె స్నేహితులను అడిగి తెలుసుకున్నారు. జ్వరంతో కళాశాలకు ఆటోలో వచ్చిందని, ఉదయం మాత్ర వేసుకొని టిఫిన్ చేసిందని ఆమె స్నేహితురాలు తెలిపారు. అయితే పూజిత తన ఫోన్‌లో బుధ వారం సాయంత్రం 'ద ఎండ్' అని స్టేటస్ పెట్టుకున్నదని తెలిపారు. ప్రేమ వ్యవహారంతోనే పూజిత ఆత్మహత్యకు యత్నించి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు, ఆటో ఢీ

» నలుగురికి తీవ్ర, మరో 12 మందికి స్వల్ప గాయాలు

పెబ్బేరు రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కూలీలతో వెళ్తున్న ఆటోను కారు ఢీకొనడంతో 16 మంది గాయపడ్డారు. వారిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వనపర్తి జిల్లా, పెబ్బేరు మండల పరిధిలోని తోమాలపల్లి గ్రామానికి చెందిన 16 మంది కూలీలు జోగులాంబ గద్వాల జిల్లాలో పత్తితీత పని కోసం ఆటోలో బయలుదేరారు. వారు వస్తున్న ఆటోను బైపాస్‌లో గద్వాల నుంచి పెబ్బేరు వైపు వస్తున్న కారు ఢీకొన్నది. దీంతో ఆటోలో ఉన్న 12 మంది కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ రవితో పాటు గీరమ్మ, చెన్నమ్మ, అక్కమ్మ అనే మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు స్పందించి క్షతగాత్రులను 108 అంబులెన్సులో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు.

కారు, స్కూటీ ఢీకొని యువకుడికి..

వెల్దండ (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని రాఘాయిపల్లి గేట్ సమీపంలో హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై కారు, స్కూటీ ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పెద్దాపూర్ గ్రామానికి చెందిన చెన్నోజు నవీన్ స్కూటీపై తమ ఊరికి వస్తూ, హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వస్తున్న కారును వెనుక నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నవీన్‌ను స్థానికులు కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. క్షతగాత్రుడి తండ్రి శేఖరాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

కారు, ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరికి..

వనపర్తి రూరల్ (ఆంధ్రజ్యోతి) : కారు, ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరు యువకులు గాయప డ్డారు. వనపర్తి మండలంలోని నాచహల్లి శివారులో గురువారం ఈ సంఘటన జరిగింది. కిష్టగిరికి చెందిన మహేశ్, శశి లు ద్విచక్రవాహనంపై గ్రామం నుంచి పెబ్బేరుకు వెళ్తూ, నాచహల్లి శివారులో ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నారు. దీంతో ఇద్దరు యువకుల కాళ్లు విరిగాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, వారిని వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కారు యజమాని షకీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు.

బస్సు, బైక్ ఢీకొని ఒకరికి..

మహమ్మదాబాద్ (ఆంధ్రజ్యోతి) : బస్సు, బైకు ఢీకొని ఓ యువకుడు గాయపడ్డాడు. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల పరిధిలోని నంచర్ల గేట్ క్రాస్ రోడ్డులో గురువారం ఈ ప్రమాదం జరిగింది. దేశాయిపల్లి గ్రామానికి చెందిన బన్ని అనే యువకుడు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, నంచర్ల గేటు వద్ద పరిగి డిపోకు చెందిన బస్సు ఢీకొన్నది. దీంతో గాయపడిన అతడిని 108 అంబులెన్సులో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్ ఢీకొని పాదచారికి..

వెల్దండ, నవంబరు మండల పరిధిలోని వెల్దండ - చారకొండ రోడ్డుపై బొల్లంపల్లి చౌరస్తా వద్ద గురువారం రాత్రి పాదచారిని గుర్తుతెలియని బైక్ ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బొల్లంపల్లి గ్రామానికి చెందిన బండ్ల జంగయ్య అను వ్యక్తి తన వ్యవసాయ పొలంనుండి ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా వెనుకగా వచ్చిన గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో జంగయ్య తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో జంగయ్యను చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బాలుడి మృతదేహం లభ్యం

» జూరాల కాలువలో చేపల వేటకు వెళ్లి గల్లంతు

గద్వాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జూరాల కాలువలో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యమైంది. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బీడీ కాలనీకి చెందిన మౌలాలి కుమారుడు సలీమ్ (15) బుధవారం మండల పరిధిలోని గుంటిపల్లి - రేకులపల్లి రోడ్డు సమీపంలోని జూరాల కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం గజ ఈతగాళ్ల సహకారంతో కాలువలో గాలింపు చేపట్టారు. గల్లంతైన ప్రదేశానికి సమీపంలోనే బాలుడి మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన డీసీఎం

అయిజ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): క ర్నూల్ రహదారిలో అ దుపు తప్పిన డీసీఎం పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్ళింది. ఆ డీసీఎం బుధవారం రాత్రి కర్నూల్ నుంచి వరి విత్తనాల లోడ్‌తో రాయిచూర్‌కు వెళ్లింది. అక్కడ అన్‌లోడ్ చేసి అయిజ మీదుగా కర్నూల్‌కు బయలుదేరింది. అర్ధరా త్రి 12 గంటల సమయంలో దర్గా వంతెన సమీపంలో అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్ళింది. డ్రైవర్ షేక్షాసురక్షితంగా బయటపడ్డాడు.

అప్పు చెల్లించాలని వ్యక్తిపై దాడి

కోడేరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తీసుకున్న అప్పు తిరిగి చెల్లించలేదని ఓ వ్యక్తిపై మరో వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. స్థానికులు, కోడేరు ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండలంలోని పస్పుల గ్రామానికి చెందిన ఎజ్రా అనే వ్యక్తి, పెంట్లవెల్లి మండల కేంద్రానికి చెందిన రమేశ్‌నాయుడు రూ. 7.12 లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించాలని అతడు ఎజ్రాను అడుగగా అప్పుడు, ఇప్పుడూ అంటే దాటవేస్తున్నాడు. దీంతో రమేశ్‌నాయుడుతో పాటు మరికొందరు బుధవారం పసుపుల గ్రామంలోని వారి ఇంటికి వెళ్లి డబ్బులు అడిగారు. ఈ సందర్భంగా మాటామాటా పెరిగిన ఎజ్రాపై దాడి చేశారు. అతడు 100కు ఫోన్ చేయడంతో కోడేరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అందరినీ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అయితే కేసు తమ పరిధిలోకి రాదని చెప్పి, పెంట్లవెల్లికి పంపించారు. అక్కడ ఎస్ఐ లేకపోవడంతో రమేశ్‌నాయుడు, అతడి అనుచరులు ఎజ్రాను వెంట తీసుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ జగదీశ్వర్ ఎజ్రాను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

తీరనున్న ఉపాధ్యాయుల కొరత

» 320 మంది బోధకుల నియామకానికి గ్రీన్ సిగ్నల్

నారాయణపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరనున్నది. ఆయా పాఠశాలల బోధకుల నియామకానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అందాయి.

ప్రభుత్వం గత ఏడాది జూన్, ఈ ఏడాది అగస్టులో పలువురు ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించింది. దీంతో ఏర్పడిన ఖాళీల భర్తీకి బోధకులను నియమించాలని నిర్ణయించిన ప్రభుత్వం, అందుకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేసింది.

పేట జిల్లాలో 429 పోస్టులు ఖాళీ

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 2,323 ఉపాధ్యాయ పోస్టులకు గాను 1,894 మంది పని చేస్తున్నారు. పదోన్నతులతో 429 పోస్టులు ఖాళీ అయ్యాయి. 90 మంది సర్‌ప్లస్ టీచర్లు (విద్యార్థులు తక్కువ, ఉపాధ్యాయులు తక్కువ) ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 337 ఉండగా, వాటిలో 18,096 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 86 ఉండగా, 9,989 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 75 ఉండగా, 22,319 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 112కు 112 మంది ఉన్నారు. ఎస్‌జీటీలు 1,191 మందికి గాను, 860 మంది పని చేస్తున్నారు. 331 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 1,038 గాను, 939 మంది పని చేస్తున్నారు. 99 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జీహెచ్‌ఎంలు 63 మందికి గాను, 55 మంది పనిచేస్తుండగా, 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భాషా పండితులు 29 మందికి 29 మంది పనిచేస్తుండగా, పీటీలు 8 మంది, పీడీలు 37 మంది విధుల్లో ఉన్నారు. వారిలో 76 మందిని సర్దుబాటు చేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు 116 ఉండడంతో విద్యాబోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రత్యామ్నాయ్యంగా 320 మంది బోధకులను నియమించాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. గత ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా నియామకానికి చర్యలు తీసుకోవాలని జూలై 17న మద్దూర్ మండలం లోని నిడ్జింత జడ్పీహెచ్‌ఎస్‌కు వచ్చిన విద్యాశాఖ కా ర్యదర్శి యోగితా రాణాకు పీఆర్‌టీయూ జిల్లా అధ్య క్షుడు యాదగిరి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యా యులు వినతి పత్రం సమర్పించారు.


ఊట్కూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలెక్టర్ సిక్తా పట్నాయక్ (ఫైల్)

9న జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో పాల్గొననున్న మహబూబ్‌నగర్ జిల్లా బాల, బాలికల జట్లను ఈ నెల 9న ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తిగౌడ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలుచుకున్న బాలురు 75 కిలోల బరువు కలిగి ఉండాలని, 2006, జనవరి 18 తరువాత జన్మించి ఉండాలని సూచించారు. బాలికలు 65 కిలోల బరువు ఉండాలని, 2005, డిసెంబర్ 29 తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల వారు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో 9వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు రిపోర్టు చేయాలని కోరారు. ఎంపికైన బాలుర జట్టు డిసెంబర్ 5 నుంచి 7వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొంటుందని తెలిపారు. బాలికల జట్టు కరీంనగర్ జరిగే టోర్నీలో పాల్గొంటుందని పేర్కొన్నారు.


దిగువ జూరాల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోని టర్బైన్‌లు

పవర్ 'ఫుల్'

» రికార్డు స్థాయిలో జల విద్యుత్ ఉత్పత్తి

» ప్రాజెక్టుల ప్రారంభం నుంచి ఇదే అత్యధికం

ఆత్మకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ప్రాజెక్టు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 950 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో 610 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో భారీ వర్షాలతో జూరాల ప్రాజెక్టుకు నిరంతరాయంగా వరద వస్తుండటంతో జూన్ మొదటి వారం నుంచి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు.

అక్టోబర్ మొదటి వారం నాటికే నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించి, 950 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. జెన్‌కో అధికారుల సహకారంతోనే రికార్డు స్థాయి ఉత్పత్తి సాధించినట్లు ఎస్ఈ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

» డీఎస్పీ బుర్రి శ్రీనివాస్

» వెల్గొండలో పోలీసుల 'కమ్యూనిటీ కాంటాక్ట్'


వెల్గొండలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ బుర్రి శ్రీనివాస్

బిజినేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ ప్రజలకు సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి రూ. 50 వేలు కడితే, లక్ష రూపాయలు మీ ఖాతాలో వేస్తామంటూ మాయమాటలు చెప్తే మోసపోవద్దని హెచ్చరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలంలోని వెల్గొండలో గురువారం తెల్లవారుజామున డీఎస్పీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా నాగర్‌కర్నూల్ సర్కిల్ పరిధిలోని ఐదుగురు ఎస్ఐలు, 60 మంది పోలీసు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని 47 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు, ఒక టాటా ఏస్, 2 బొలెరోలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సీజ్ చేసిన వాహనాల యజమానులు సరైన ధ్రువపత్రాలను సమర్పిస్తే తిరిగి అప్పగిస్తామని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా శుభకార్యాలు, ఇతర పనుల కోసం ఇంటికి తాళాలు వేసి వెళ్ళేటప్పుడు విధిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తద్వారా చోరీలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. రెండు, మూడు రోజుల వరకు వచ్చే పరిస్థితి లేనప్పుడు ఇంట్లో విలువైన అభరణాలు, నగదు ఉంచకూడదని సూచించారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ అశోక్ రెడ్డి, ఎస్ఐ కే.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

» రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి


లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పేద, బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో గురువారం సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 78 మంది లబ్దిదారులకు రూ. 22 లక్షలకు పైగా విలువైన చెక్కులను అందించినట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచడమే కాకుండా, కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న పేదలను, సీఎం సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ఖమర్‌మియా, ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్దన్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎండీ బాబా, సమ్మద్ మియా, జానంపేట నాగరాజు, నాగార్జున, అబ్దుల్లా, గోవర్ధన్, లీలావతి పాల్గొన్నారు.

సత్తా చాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు


నేషనల్ క్రికెట్ లీగ్‌కు ఎంపికైన పాలమూరు జిల్లా క్రీడాకారులు


రాష్ట్రస్థాయి కబడ్డీకి ఎంపికైన ఖిల్లాఘణపురం కేజీబీవీ ఇంగ్లిష్ మీడియం విద్యార్థిని పూజ


12 అండర్ 17 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన ఆత్మకూరు విద్యార్థితో పీఈటీలు

» నేషనల్ క్రికెట్ లీగ్‌కు ముగ్గురి ఎంపిక

» రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఇద్దరు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్/ ఖిల్లాఘణపురం/ ఆత్మకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. నేషనల్ క్రికెట్ లీగ్ (ఎన్‌సీఎల్)కు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. హైదరాబాద్ పరిధిలో, మొయినాబాద్‌లోని క్రికెట్ మైదానంలో బుధవారం నిర్వహించిన సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్ మ్యాచ్‌లో షేక్‌ఫర్హాన్, మహ్మద్ ముర్తుజాఅలీ, జి.శ్రేయాన్ మెరుగైన ప్రతిభ కనబరిచి, ఎన్‌సీఎల్ లీగ్, అండర్-12 విభాగంలో చోటు దక్కించుకున్నారు. త్వరలో గోవా, హైదరాబాద్‌లలో నిర్వహించనున్న ఎన్‌సీఎల్ వేలంలో వీరు పాల్గొననున్నారు. షేక్‌ఫర్హాన్, మహ్మద్ ముర్తుజాఅలీ, జి.శ్రేయాన్‌లను జిల్లా క్రికెట్ క్లబ్ కోచ్‌లు రియాజుద్దీన్, ముఖ్తర్, నవాజ్ అభినందించారు. టోర్నీలో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

● వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం కేజీవీబీ ఇంగ్లీష్ మీడియం 9వ తరగతి విద్యార్థిని కె.పూజ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌ఓ లలిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నారాయణపేటలో ఈ నెల 4న జరిగిన అండర్ - 17 ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ జోనల్ మీట్‌లో పూజ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు భద్రాద్రి కొత్తగూడెంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో బాలిక పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పీఈటీ చిట్టి ఆమెను అభినందించారు.

● ఆత్మకూరు ప్రభుత్వ బాలుర పాఠశాల 10వ తరగతి విద్యార్థి మోహన్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి కొండాపురం బాలరాజ్ తెలిపారు. ఇటీవల నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలో జరిగిన ఉమ్మడి పాలమూరు జిల్లా అండర్ 17 కబడ్డీ పోటీల్లో మోహన్ సత్తా చాటినట్లు తెలిపారు. ఈ నెల 8 నుంచి 25వ తేదీ వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నాడు.

ఈ సందర్భంగా గురు వారం పాఠశాలలో విద్యార్థి మోహన్‌ను ప్రధానోపాధ్యాయుడు బాలస్వామి, పీఈటీ వెంకటేశ్వర్, ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా, వాలీబాల్ కోచ్ ఖాదర్ తదితరులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు వస్పుల విద్యార్థి

మిడ్జిల్ : (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలోని వస్పుల జడ్పీహెచ్‌ఎస్ 10వ తరగతి విద్యార్థి బి.చరణ్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ శంకర్ తెలిపారు. నారాయణపేట జిల్లా, కోస్గి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం నిర్వహించిన పోటీల్లో చరణ్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడని చెప్పారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటయ్య, పీడీ శంకర్, ఉపాధ్యాయులు చరణ్‌ను అభినందించారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు కోస్గిలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో చరణ్ పాల్గొననున్నట్లు తెలిపారు.


రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థి చరణ్‌తో ఉపాధ్యాయులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అక్షితతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అంబటిపల్లి విద్యార్థి

లింగాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు అక్షిత అనే విద్యార్థిని ఎంపికైనట్లు అంబటిపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ తెలిపారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలో జరిగిన ఉమ్మడి జిల్లా 69వ ఎస్‌జీఎఫ్ అండర్-17బాలికల విభాగం కబడ్డీ క్రీడల్లో లింగాల మండలం అంబటిపల్లి హై స్కూల్‌లో 9వతరగతి చదువుతున్న డి.అక్షిత నాగర్‌కర్నూల్ జిల్లా తరఫున పాల్గొని ప్రావీణ్యం కనబరుస్తూ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు. మెరుగైన రీతిలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్న అక్షితను పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం నిరంజన్, పీడీ నరేందర్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం

» మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి

» జోనల్ లెవల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ప్రారంభం


చిట్టబోయిన్‌పల్లి సాంఘిక, సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న ఎస్పీ జానకి

జడ్చర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో విద్యార్థులకు క్రమశిక్షణ అలవరుతుందని, ఓర్పుతో జట్టుగా పనిచేయడం అలవాటవుతుందని, తద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి అన్నారు. జడ్చర్ల మండలంలోని చిట్టబోయిన్‌పల్లి సాంఘిక, సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ సోషల్‌వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ సొసైటీ 11వ జోనల్ లెవల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌ను గురువారం ఆమె క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తాను కూడా గురుకుల పాఠశాలలోనే చదువుకున్నానని, హ్యాండ్‌బాల్ ఆడేదానినని గుర్తుచేసుకున్నారు. విద్యార్థినులు అన్ని రంగాలలో ముందంజలో ఉండాలని సూచించారు.

ఈ క్రీడోత్సవంలో మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాలలోని వివిధ సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాలల విద్యార్థినులు 935 మంది పాల్గొన్నారు. వారికి అథ్లెటిక్స్‌తో పాటు కబడ్డీ, ఖోఖో, హ్యాండ్‌బాల్, వాలీబాల్, టెన్నికాయిట్‌తో పాటు, చెస్, క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, జోనల్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ షంషేర్‌అలీ, పీఈటీ శరణ్య, ఉపాధ్యాయులు రాజేశ్వరి, భవాని, శ్రీదేవిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

- కృష్ణదేవ, ఎస్ఐ, ఊర్కొండ



ఊర్కొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులతో పాటు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని ఎస్ఐ కృష్ణదేవ అన్నారు. గురువారం ఆయన ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలపై మాట్లాడారు.

ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

రోడ్డు ప్రమాదాల నివారణకు మండలంలోని గ్రామాల ప్రజలు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాము. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వాహనదారులకు తనిఖీలు నిర్వహిస్తున్నాం.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

మద్యం సేవించి వాహనాలు నడిపినప్పుడు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిని తక్కువ మోతాదులో ఉంటే వెంటనే చలానా వేసి వాహనాన్ని సీజ్ చేస్తున్నాం. మోతాదు మించితే కోర్టులో హాజరు పరిచినప్పుడు న్యాయమూర్తి విధించిన శిక్షలను అమలు చేస్తున్నాం.

మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ఎలా ఉంది ?

మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ప్రధానంగా మంగళ, గురు, శనివారాల్లో ఊర్కొండ ప్రధాన గేటు వద్ద ఉంటుంది. అక్కడ వాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్నాం. సాయంత్రం వేళ వైన్స్ ముందు రోడ్డుపై వాహనాలను నిలుపుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. చర్యలు తీసుకుంటాము.

అభయాంజనేయస్వామి ఆలయం వద్ద భద్రత ఎలా ఉంది ?

అభయాంజనేయస్వామి ఆలయం వద్ద అవుట్‌పోస్టు ఏర్పాటు చేశాం. అక్కడ శనివారం రోజు 24 గంటల పాటు ఇద్దరు పోలీసులను ఉంచి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాము. ప్రతీ రోజు రాత్రి వేళ్ల పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం.

న్యూస్ బాక్స్

జిల్లా ఆసుపత్రిలో బాధితున్ని పరామర్శించిన బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కోడేరు మండలం పసుపుల గ్రామానికి చెందిన దళిత మిద్దె ఎజ్రాను కిడ్నాప్ చేసి పాశవికంగా దాడి చేసిన ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ డిమాండ్ చేశారు.గురువారం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు మిద్దె ఎజ్రాను బీఎస్పీ నాయకులు పరామర్శించారు. దాడి చేసిన వారికి పోలీసులు పరోక్ష సహకారం అందించడం దారుణమన్నారు. సివిల్ కేసులో పోలీసుల జోక్యం తగదని, ఘటనలో దాడి చేసిన వారికి సహకరిస్తున్న కోడేరు ఎస్ఐని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా నాయకులు పృథ్వీరాజ్, హర్ష ముదిరాజ్, రాంచందర్, కళ్యాణ్, రామకృష్ణ పాల్గొన్నారు.

'రైతులను ఆదుకోవాలి'

చారకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్‌తో మండలంలో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ యువ నాయకుడు చింతపల్లి కిరణ్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతి కొచ్చే దశలో తుపాను వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. పత్తి, వరి, మొక్కజొన్న, వేరు శనగ పంటలకు ఎకరాకు రూ. 20వేల చొప్పున పరిహారం అందించాలని కోరారు.

ఖోఖో ఆటగాళ్లకు దుస్తుల పంపిణీ

వెల్దండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిలో నిర్వహించే ఖోఖో పోటీల స్టేట్ మీట్‌కు వెళుతున్న క్రీడాకారులకు గురువారం హైదరాబాద్‌కు చెందిన ఎలైట్ ఇండియా ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ నిర్వాహకులు క్రీడాదుస్తులను అందజేశారు. కల్వకుర్తి పట్టణంలో ఇటీవల నిర్వహించిన ఖోఖో శిక్షణ శిబిరం శిక్షణ తీసుకుని స్టేట్ మీట్‌కు వెళుతున్న ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల నుంచి ఎంపికైన క్రీడాకారులకు సంస్థ సభ్యులు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఖోఖో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి విలియం, ఆర్గనైజర్ గోకమళ్ల రాజు, బీఆర్ఎస్ నాయకులు జంగిలి యాదగిరి, లింగమయ్య, యాదగిరి ఉన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారి

కొల్లాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముక్కిడిగుండం, మొలచింతలపల్లి గ్రామాలలో ఇటీవలే వర్షాలకు దెబ్బతిన్న వరి, మినుము పంటలను మండల వ్యవసాయ అధికారి చిన్నహుస్సేన్ యాదవ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాలకు దెబ్బతిన్న వరి, మినుము పంటలను తిరిగి యథాస్థానంలోకి వచ్చేలా రైతులకు సలహాలు సూచనలు చేశారు. పంట పరిరక్షణకై రైతులు వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నష్టం వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందించామని తెలిపారు. అధికారుల సలహాలు, సూచనలతో మినుము, వరి పంటలకు ఫర్టిలైజర్, పెస్టిసైడ్ వాడాలని ఆయన రైతులకు సూచించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రజాబాట

- ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించిన ట్రాన్స్‌కో ఎస్ఈ వెంకట నర్సింహారెడ్డి



వెల్దండలో సమస్యలను తెలుసుకుంటున్న ఎస్ఈ నర్సింహారెడ్డి

వెల్దండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకే ప్రజాబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ వెంకట నర్సింహారెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యుత్ సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి, స్థానికులను సమస్యలు అడిగితెలుసుకున్నారు. గ్రామాలలో విద్యుత్ లోవోల్టేజీ సమస్యలు రాకుండా అవసరమైన మేర ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇళ్లపై ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలని, వేలాడుతున్న వైర్లను సవరించాలని అన్నారు. వేలాడుతున్న వైర్లను సరిచేసేందుకు విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో ని విద్యుత్ సమస్యలను పీఏసీఎస్ డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎస్ఏవో పార్థసారధి, లైన్‌మన్‌లు లక్ష్మణ్, లష్కర్ ఉన్నారు.

● చారకొండ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని విద్యుత్‌శాఖ ఏఈ జానకీరాంనాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని క్వాటర్స్‌లో స్థానిక నాయకులతో కలిసి ఏఈ కాలనీ వాసులతో మాట్లాడి విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి, వేలాడుతున్న వైర్లను సరిచేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండెవెంకట్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్, నాయకులు జేసీబీ వెంకటయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ కన్ననాయక్, లైన్‌మన్ బాలునాయక్, అసిస్టెంట్ లైన్‌మన్ శ్రీశైలం ఉన్నారు.

నేటి నుంచి వందేమాతరం 150వ వార్షికోత్సవాలు

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నాగేంద్రంగౌడ్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నాగేంద్రంగౌడ్

కందనూలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వందేమాతరం గేయం స్వరపర్చి 150 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ఈనెల 7వ తేదీ నుంచి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నాగేంద్రంగౌడ్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు వందేమాతరం 150వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెమినార్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక పాఠశాల నుంచి పీజీ కళాశాల వరకు, బీఈడీ, మెడికల్, ఇతర సాంకేతిక కళాశాలల్లో సైతం ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, చంద్రకళ, ప్రమోద్, భీమేష్, జగదీశ్, సూరి, నాయకులు పాల్గొన్నారు.

కపిలవాయి లింగమూర్తికి ఘన నివాళి



కపిలవాయి లింగమూర్తి చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న సాహితీ అభిమానులు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కవితా కళానిధి డాక్టర్ కపిలవాయి లింగమూర్తి 7వ వర్ధంతిని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కపిలవాయి లింగమూర్తి చిత్రపటానికి పలువురు కవులు, కళాభిమానులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ఎన్నో గ్రంథాలు రాసి ఎనలేని కృషి చేసిన కపిలవాయి లింగమూర్తి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా గ్రంథాలయానికి కపిలవయి లింగమూర్తి పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కవి ఎదిరేపల్లి కాశన్న, సీనియర్ జర్నలిస్టు కందికొండ మోహన్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

- ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల రాస్తారోకో



మాట్లాడుతున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శివశంకరగౌడ్

తిమ్మాజిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ కన్వీనర్ శివశంకర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తిమ్మాజిపేటలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర దాదాపు గంటపాటు రాస్తారోకో నిర్వహించి రోడ్డుపై బైఠాయించి విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఉపకార వేతనాలు ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే భిక్ష కాదని, అది విద్యార్థుల హక్కుగా గుర్తించాలన్నారు. రాష్ట్రంలో అధిక మొత్తంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన విద్యార్థులు ఉన్నారన్నారు. ఏఎస్ఐ ప్రిసిల్ల విద్యార్థులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగారు బాబు, మండల కన్వీనర్ వెంకటేశ్, ఏబీవీపీ నాయకులు భరత్, రమేష్, ప్రసాద్‌కుమార్, శివ, శ్రీను, అశోక్, చందు పాల్గొన్నారు.

జిన్నింగ్ మిల్లుల సమ్మె వాయిదా

- జిన్నింగ్ మిల్లుల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్

తాడూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పత్తి కొనుగోళ్లలో సీసీఐ కొత్త కొత్త నిబంధనలతో రైతులను మిల్లర్లను తీవ్ర ఇబ్బందికి గురి చేస్తున్న తరుణంలో కాటన్ జిన్నింగ్ మిల్లుల యజమానులు సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ తరుణంలో జిన్నింగ్ మిల్లుల సమ్మెకు సంబంధించి కొంత గడువు కావాలని తెలంగాణ ప్రభుత్వం కోరిందని కాటన్ జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ క్రమంలో జిన్నింగ్ మిల్లుల సమ్మెకు సంబంధించి తాత్కాలికంగా సమ్మె వాయిదా వేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో సీసీఐ తన పద్ధతి, మార్చుకోకపోతే ఖచ్చితంగా సమ్మెకు వెళ్తామని తెలిపారు.

లబ్ధిదారులకు చికెన్, ఎగ్ కార్ట్ అందజేత



స్టా, సామగ్రిని అందజేస్తున్న జూపల్లి భాస్కర్‌రావు

చారకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో జాతీయ గుడ్డు సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపల్లి భాస్కర్‌రావు పలువురు లబ్ధిదారులకు చికెన్, ఎగ్ ఫ్రైడ్ చేసే బండ్లను అందజేశారు. మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన ఎండీ సిరాజ్, తుర్కలపల్లికి చెందిన కట్ట ఆంజనేయులు, గోకారం గ్రామానికి చెందిన ఎండీ రషీద్, చారకొండకు చెందిన రాముని అలివేలుకు రూ. 1.20 లక్షలు విలువ చేసే బండ్లను అందజేశారు. కార్యక్రమంలో మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్కే సలీం, ఎర్రవల్లి మాజీ సర్పంచ్ సాయికుమార్, బీఆర్ఎస్ మండల యువ నాయకుడు ప్రశాంత్, పౌల్ట్రీ ఫెడరేషన్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'రైతులకు పరిహారం చెల్లించాలి'

కోడేరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మినుములు, మొక్కజొన్న, వరి తదితర పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి వారికి వరికి ఎకరాకు రూ. 10వేలు, మొక్కజొన్న, మినుములు తదితర పంటలకు ఎకరాకు రూ. 40వేలు నష్టపరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు స్వామి, నరసింహ, లక్ష్మయ్య, వరప్రసాద్, వెంకటస్వామి, లక్ష్మయ్య, శ్రీనివాసులు, రవి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందాలి

- కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి

కల్వకుర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పూర్తి స్థాయి అవగాహన పెంపొందించడానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ వాల్‌పోస్టర్లను స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో కల్వకుర్తిలో ఎస్ఐ, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు బి.చంద్రశేఖర్, నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ చెకుముకి పోటీలు పాఠశాల స్థాయిలో నవంబరు 12న, జిల్లా స్థాయిలో నవంబరు 28న, రాష్ట్ర స్థాయిలో డిసెంబరు 12, 13, 14వ తేదీల్లో కరీంనగర్ జిల్లాలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు నెహ్రూ ప్రసాద్, జంగయ్య, సందీప్, రాజేందర్‌రెడ్డి, అమీరుద్దీన్, నారాయణరావు, జిల్లా కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన ఏవో

వెల్దండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటలను గురువారం వ్యవసాయాధికారి శోభారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా రాచూరు గ్రామంలో మొక్కజొన్న, వరి, పత్తి పంటల వివరాలను నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఈవో గణేష్ ఉన్నారు.

ఆత్మీయ భరోసా అమలులో ప్రభుత్వం విఫలం

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ

మన్ననూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ విమర్శించారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రంథాలయ భవనంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు భూమి లేని నిరుపేద కూలీలు 20రోజులు ఉపాధి హామీ పనులు చేస్తే వారందరికీ ఏడాదికి రూ.12 వేలు చెల్లిస్తామని చెప్పి ప్రస్తుతం హామీ నెరవేర్చడం లేదని అన్నారు. ఆధార్ కార్డుకు జాబ్ కార్డుకు లింకు చేసి డబ్బులు ఇస్తామని చెప్పి, లక్షలాది మంది కూలీలను ఉపాధిహామీ పథకంలో నుంచి తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లేష్, రైతు సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసరెడ్డి, కార్మిక సంఘం నాయకుడు చంద్రయ్య పాల్గొన్నారు.

ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వడంలో జాప్యం వద్దు

- మాదాసి కురువ, మాదారి కురువలు



తెలకపల్లిలో తహసీల్దార్‌కు వినతి ఇస్తున్న సంఘం నాయకులు

తెలకపల్లి/ పెద్దకొత్తపల్లి/ పెంట్లవెల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మాదాసికురువ, మాదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరగకుండా చూడాలని ఆ సంఘం నాయకులు కోరారు. గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వారు స్థానిక అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. తెలకపల్లిలో ఆ సంఘం నాయకుడు పెద్దపల్లి లింగస్వామి ఆధ్వర్యంలో తహసీల్దార్ జాకీర్ అలీకి ఆ వినతి పత్రం అందజేశారు. పూర్వకాలం నుంచి తమ పూర్వీకులు నిరక్షరాస్యత కారణంగా కురువలుగా పిలవబడి బీసీ జాబితాల్లో ఉన్నదని, ఇంతకాలం అన్యాయానికి గురయ్యామని ఆయన అన్నారు. ఇప్పటికైనా తమ అసలైన కూలాలు మాదాసి, మాదారి కురువల పేరుతో ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేయాలని వారు కోరారు. లింగేష్, రాములు, వేణుగోపాల్, కృష్ణ, వేణు, రాజు, శివ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. పెద్దకొత్తపల్లిలో మాదారి, మాదాసి కురువలను ఎస్సీలుగా గుర్తించి కుల ధ్రువీకరణ సర్టిపికెట్లు జారీ చేయాలని కోరుతూ ఆ సంఘం మండల అధ్యక్షుడు బెట్టరి నాగరాజు, ప్రధాన కార్యదర్శి కొల్లై ఈశ్వర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. దండు చంద్రయ్య, నాయకులు జెమిని ధర్మయ్య, కొల్లిచిన్న తిరుపతయ్య, శారద, రాముడు పాల్గొన్నారు. పెంట్లవెల్లి మాదారి, మాదాసి కురువలను ఎస్సీలుగా గుర్తించి కుల ధ్రువీకరణ సర్టిపికెట్లు జారీ చేయాలని కోరుతూ ఇన్‌చార్జి మాదాసి, మాదారి కురువ మండల అధ్యక్షుడు మౌలాలి, గౌరవ అధ్యక్షుడు నాగయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు నాగేష్, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో బోధనా సామర్థ్యాలు పెంచాలి

- కొండారెడ్డిపల్లిలో పాఠశాలను పరిశీలించిన డీఈవో



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈవో రమేష్

వంగూరు, నవంబరు 6 : (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో బోధనా సామర్థ్యాలను మరింతగా పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలను గురువారం డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను ఆయన పరి శీలించారు. అనంతరం డీఈవో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు విధిగా సమయపాలన పాటించాలని, విద్యార్థుల బోధన సామర్థ్యాలను మరింతగా మెరుగు పర్చాలని సూచించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.

ఆరోగ్య రక్షణ కేంద్రాలుగా పని చేయాలి

- సబ్ సెంటర్లను పరిశీలించిన డీఎంహెచ్ఓ డాక్టర్ రవినాయక్



వ్యాక్సిన్ వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో రవి నాయక్

మన్ననూర్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్య రక్షణ కేంద్రాలుగా పీహెచ్‌సీ సబ్ సెంటర్లు కీలకపాత్ర పోషించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రవి నాయక్ అన్నారు. నల్లమల అభయారణ్య ప్రాంతంలోని మన్ననూరు, అప్పాపూర్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను జడ్పీటీసీహెచ్ఐ బృందం సభ్యులతో కలిసి గురువారం సందర్శించారు. సబ్ సెంటర్లలో వ్యాక్సినేషన్ రికార్డులను పరిశీలించారు. సరైన పౌషకాహారం అందని చెంచు గిరిజన చిన్నారుల కోసం నల్లమల ప్రాంతంలో ప్రత్యేక వ్యాక్సినేషన్ కేంద్రం ఏర్పాటుకు ఉన్న వనరులను పరిశీలించారు. కార్యక్రమంలో జడ్పీటీసీహెచ్ఐ బృందం సభ్యులు పీటర్, డేవిడ్, బద్రి, శ్రీనాథ్, ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

- బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నల్ల కండువాలతో మౌన ప్రదర్శన



నల్లకండువాలతో మౌన ప్రదర్శన చేస్తున్న బీసీ జేఏసీ నాయకులు

కల్వకుర్తి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) :42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ జేఏసీ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. కల్వకుర్తి బీసీ జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లివిగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నల్లకండువాలతో మౌన ప్రదర్శన ర్యాలీ గురువారం సాయంత్రం నిర్వహించారు. బీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని 42శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీజేఏసీ నాయకులు సదానందంగౌడ్, రాజేందర్, గోపాల్, ఎముక జంగయ్య, దామోదర్‌గౌడ్, శేఖర్, సైదులు యాదవ్, పాండు యాదవ్, రవి, రాంసాగర్, అమరేందర్, కృష్ణయ్య, సుధాకర్, సతీష్, రాజు, వీరస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళ్లకు గంతలతో ఆందోళన



కళ్లకు గంతలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్/ అచ్చంపేట టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.తారాసింగ్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, అభిమన్యు, గిరిధర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

● అచ్చంపేటటౌన్ (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ సయ్యద్ ఆధ్వర్యంలో విద్యార్థులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు ప్రవీణ్, తరుణ్, విజయ్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక




లక్ష్మణ్‌నాయక్, తిరుపతినాయక్

నాగర్‌కర్నూల్‌టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ (టీటీటీఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కె.లక్ష్మణ్‌నాయక్, ఇ.తిరుపతినాయక్ ఎన్నికయ్యారు. ఈ మేరకు టీటీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల ప్రమోషన్లకు సంబంధించిన జీవో నెంబరు 2లోని అడెక్వసీ విధానం ఎత్తివేసి సీనియారిటీ ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని, జీవో నెంబరు 3లోని ఏజెన్సీ ఏరియాను అమలు చేయాలని, జీవో నెంబరు 342 పూర్తి స్థాయిలో అమలు చేయాలని, నూతన పీఆర్సీ, పెండింగ్‌లో ఉన్న 5డీఏల మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సైబర్ నేరగాళ్ల మోసాలపై విద్యార్థులకు అవగాహన

కొల్లాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ మోసాలతో విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ చుట్టు ఉన్న వారికి సైబర్ నేరగాళ్ల గురించి వివరిస్తూ వారిని చైతన్య పరచాలని కొల్లాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేష్ సూచించారు. సైబర్ నేరాల పట్ల కొల్లాపూర్ పట్టణంలోని డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.ఎన్ ఉదయ్ కుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఆన్‌లైన్ మోసాలు ఎలా జరుగుతాయి, డిజిటల్ అరెస్టు ఎలా ఉంటుంది, బిట్ కాయిన్స్ ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ హనీ ట్రాకింగ్ స్టాక్ ఎక్ఛేంజ్ లోన్ యాప్ మోసాల పట్ల విద్యార్థులకు సీఐ క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, పోలీసులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

18న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో భాగంగా ఈ నెల 18న జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్‌లో సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి వి.సీతారాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జానపద నృత్యం, జానపద పాటలు, కథా రచన, పేయింటింగ్, వక్తృత్వ, కవిత్వం, ఇన్నోవేషన్ ప్రదర్శన అంశాల్లో యువతి యువకులకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలో పాల్గొను యువతీ యువకులు జిల్లా చెందిన వారై 29 సంవత్సరాల లోపు వయస్సు కలిగి జిల్లాకు చెందిన వారై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయం సిబ్బంది ఫోన్ నెంబర్లు 9059174909, 8341661832ను సంప్రదించాలని ఆయన సూచించారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

తిమ్మాజిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జ్ఞానశేఖర్ అన్నారు. తిమ్మాజిపేట మండలంలోని గుమ్మకొండ, పుల్లగిరి గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరాల్లో 337తెల్లజాతి పశువులకు, 67నల్లజాతి పశువులకు టీకాలు వేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారులు ఉదయ్‌కుమార్‌రెడ్డి, శ్రావణి, పశువైద్య సిబ్బంది విజయలలిత, ఖాదర్, యాదగిరి, శాంతయ్య, గోపాలమిత్రలు జగ్జీవన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

'చెంచు పెంటలకు నేరుగా రేషన్ బియ్యం సరఫరా చేయాలి'

మన్ననూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అభయారణ్య ప్రాంతంలోని లోతట్టు ప్రాంత పెంటలైన రాంపూర్, ఈర్లపెంట, భౌరాపూర్, సంగిడి గుండాల పెంటలకు ప్రతీ నెలా ఇచ్చే రేషన్ బియ్యాన్ని జీసీసీ ద్వారా నేరుగా సరఫరా చేయాలని చెంచులు కోరుతు న్నారు. ఇటీవలి కాలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా రోడ్లన్నీ బురదమయంగా మారి నడవలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మల్లాపూర్ పెంటకు మాత్రమే జీసీసీ ద్వారా నేరుగా బియ్యం సరఫరా చేస్తున్నారని, తమ పెంటలకు మాత్రం అప్పాపూర్ కేంద్రంలోనే ఇస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి ఈ నెల బియ్యాన్ని నేరుగా అందజేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పెద్దకొత్తపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తూ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందిన వెంకటస్వామి కుటుంబానికి గురువారం రూ.2లక్షలు కొల్లాపూర్ సీఐ మహేష్, ఎస్ఐ సతీష్‌లు అందజేశారు. ఆ నగదును కోడేరు మండల పసుపుల గ్రామంలోని మృతుడు వెంకటస్వామి ఇంటికెళ్లి కుటుంబ సభ్యులకు వారు అందజేశారు.

రేషన్ బియ్యం పాడయ్యాయని ఫిర్యాదు

పెద్దకొత్తపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మారేడుమానుదిన్నె గ్రామంలో ప్రజలకు పంపిణీ చేయడానికి వచ్చిన రేషన్ బియ్యం పాడైపోయాయని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మేకల శివ గురువారం పెద్దకొత్తపల్లి రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌కు ఫిర్యాదు చేశారు. బియ్యంలో పురుగులు ఉన్నాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

వంగూరు, నవంబరు 6; (ఆంధ్రజ్యోతి) మండలంలోని డిండిచింతపల్లి గ్రామంలో అనారోగ్యంతో లింగయ్య అనే వవ్యక్తి మృతి చెందాడు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్ ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. లింగయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గున్న ఆనందురెడ్డి, సైదులు, వెంకటయ్య, దేవా, రేణు, జానయ్య, పరమేష్, శ్రీశైలం పాల్గొన్నారు.